నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని రూరల్, అర్బన్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం మరమ్మతుల కారణంగా వివిధ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు. రావల్‌కోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చెరువు కట్ట ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు, గణపతి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పూడూర్ సబ్‌స్టేషన్, పూడూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రూప్‌-1 పరీక్ష నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



కీసర : కీసర మండలంలోని చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న గ్రూప్‌-1 పరీక్ష నిర్వహణను బుధవారం మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనితోపాటు పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ పర్యటనలో కాలేజ్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఎగ్జామ్స్ కంట్రోలర్ దేవయ్య, కీసర ఎంఆర్ఓ, అశోక్‌కుమార్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశిల (బొడ్రాయి) పండుగ



ద్వితీయ నాభిశిల (బొడ్రాయి) పండుగలో పూజాలో గ్రామస్తులు తదితరులు

కీసర: కీసరలో ద్వితీయ నాభిశిల (బొడ్రాయి) పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం కీసరలోని టెలిఫోన్ కార్యాలయం వద్ద ప్రతిష్ఠించిన నాభిశిల (బొడ్రాయి)కి గ్రామపురోహితులు కన్నుల పండుగగా అభిషేకం పూజను నిర్వహించారు. మాజీ సర్పంచ్ మాధురివెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్య యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 27న కీసరలో బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ గంటల తరబడి రోడ్లపై నిల్చొని తమ గమ్యస్థానానికి చేరే బస్సు వచ్చేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సుషెల్టర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. బీజేఆర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేసిన ఆయన మాట్లాడుతూ.. భోజనం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా నాణ్యత పెరగాలని, ప్రభుత్వపరంగా సహకారం కావాలంటే అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రంలోని పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మజ, మంజుల, నాయకులు బాబు, కిషోర్, మోసిన్, సలీం, సయూద్, అక్బర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో..

అక్రమాల పరంపర

- టీఎస్ బీపాస్ వచ్చినా ఆగని దందా!
- పట్టించుకోని పర్యవేక్షకులు
- చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది





సాక్షి, సిటీబ్యూరో: అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం పురపాలికలు ,గ్రామ పంచాయతీల్లో కొత్తగా టీఎస్‌-బీపాస్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. సంబంధిత అధికారుల అలసత్వం.. పలువురి సిబ్బంది చేతి వాటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇంటి నిర్మాణాలు, స్థలాల మార్పిడి కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే అధికారులు అనుమతులిచ్చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన 28 పంచాయతీల్లోని నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార వాణిజ్య సదుపాయాలకు సంబంధించిన కట్టడాల్లో అక్రమాలకు అడ్డేలేదన్న చర్చ జరుగుతోంది. తద్వారా ఆస్తి పన్ను అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలోని 13 పుర పాలికల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 5,947 దరఖాస్తులు కాగా, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 2,406 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

అధికారుల కనుసన్నల్లో..!

గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దరఖాస్తులను అధికారులు తిరస్కరించేవారు. బీ పాస్ ద్వారా అన్ని దరఖాస్తులు సులువుగా పరిష్కారమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెస్ మెంట్ లెక్కింపులో కొందరు అధికారులు, బిల్డర్లు తలా కొంత వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ఇళ్లకు కూడా కొందరు పర్యవేక్షణాధికారులు ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలకు కొలతలు తక్కువ చేసి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. పారదర్శకత కోసం ప్రభుత్వం బీ పాస్ తెచ్చినా తెర చాటు అవినీతికి కళ్లెం పడలేక పోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రధానంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, కొంపెల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, మేడ్చల్, జవహర్‌నగర్ పురపాలక సంఘాల్లో ఇష్టానుసారంగా అక్రమాల పరంపర కొనసాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో టౌన్ ప్లానింగ్‌లోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చేతివాటం ప్రదర్శిస్తున్న పుర సిబ్బంది

పురపాలికల్లో ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పెద్ద ఎత్తున తప్పిదాలు దొర్లుతున్నాయి. బీపాస్ అమల్లోకి వచ్చాక అవినీతి తగ్గుతుందనుకుంటే అక్ర మార్జనలో సిబ్బంది ఆరితేరుతున్నారు. 75 నుంచి 120 గజాల్లోపు ఇళ్ల పత్రాలన్నింటినీ పరిశీలించాలి. ఈ వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి కొలతల ఆధారంగా అసెస్‌మెంట్ లెక్కింపునకు యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాల్సి ఉంటుంది. నిర్దేశించిన కొలతల ఆధారంగా ఇళ్ల నిర్మాణాలు ఉండాలి. క్షేత్రస్థాయిలో యజమానులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి అక్రమాల పరంపరకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటామంటున్న కమిషనర్లు

పురపాలికల్లో అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సంబంధిత కమిషనర్లు పేర్కొంటున్నారు. బీపాస్ దరఖాస్తులను పరిశీలించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచిస్తున్నామంటున్నారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తున్నామని వివరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పురపాలక చట్టం ప్రకారం సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ భాగ్యనగర్ కాలనీ, దేవేందర్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ కుతాడి సాయి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జవహర్‌నగర్‌కు మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.100 కోట్లతో జవహర్‌నగర్ నలువైపులా 100 ఫీట్ల రోడ్ల పనులు ప్రారంభమవుతున్నాయన్నారు. కార్పొరేషన్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పేదలు నివసించే జవహర్‌నగర్‌కు అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ నగేష్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు సతీష్‌గౌడ్, భాస్కర్, శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి





సాక్షి,సిటీబ్యూరో: నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాన్ని ప్రవేశపెట్టి, ఎంతో మంది విద్యార్థులకు ఎంతో మేలు చేయగా, నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. ఛలో మేడ్చల్ కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్స్ నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. గత మూడు సంవత్సరాల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వెళ్లలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తోందన్నారు. ఈ నెల 27 వరకు నిధులు విడుదల చేయని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధన కార్యక్రమాన్ని చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనికి ముందు విద్యార్థులు కలెక్టరేట్ వద్ద బైఠాయించటంతోపాటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు రెహమాన్, చిన్న, ఎండీ అన్వర్, హరీష్, అరవింద్, శశిధర్, మహేష్, వందలాది మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం



స్వచ్ఛ వాహనాన్ని అందజేస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు బుధవారం నూతన వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నిత్యం పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రపరుస్తూ.. మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. నగర ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం కోసం చెత్త, చెదారాన్ని రోడ్లు, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య అధికారులకు సహకరించాలని కోరారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, కొత్త దుర్గమ్మ, సింగిరెడ్డి పద్మారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, చీరాల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు.

ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయండి



మల్లాపూర్: నాచారంలోని పలు పార్కుల్లో ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ కోరారు. దీనిపై బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్నేహపురి కాలనీ పార్క్, వీఎస్టీ కాలనీ పార్క్, రాఘవేంద్రనగర్‌లోని రైతుబజార్ వెనుకభాగంలోని ఖాళీస్థలంలో ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు మరమ్మతులకు గురయ్యాయని, కొన్నిచోట్ల విరిగిపోయి పనికిరాకుండా పోయాయన్నారు. వీటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

ఏఈఓల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

శామీర్‌పేట్: 167 మంది ఏఈఓల (వ్యవసాయ విస్తరణ అధికారి)సస్పెన్షన్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందిందని, వెంటనే సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర అడ్ హాక్ చైర్మన్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సుమారు 2వేల మంది ఏఈఓలు సమావేశమయ్యారు. ప్రభుత్వంతో తుది నిర్ణయం కోసం చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వివరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



కీసర: నాగారం మున్సిపాలిటీలో బీజేపీ బలోపేతానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలలోపు బీజేపీ మరింత బలోపేతం కానున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, జ్యోతి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి యువకుడు మృతి

మేడ్చల్‌రూరల్: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఉన్న ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మహేష్(21) గత కొంత కాలంగా పనిచేస్తున్నాడు. గత మంగళవారం మద్యం సేవించిన మహేష్ వ్యవసాయ క్షేత్రంలో తిరుగుతున్నాడు. ప్రమాదవశాత్తు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న నీటి గుంతలో పడిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సాయంలో బుధవారం మృతదేహాన్ని వెలికితీసి గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలవని పాత, కొత్త చేతులు

- పాత కొత్త నాయకుల మధ్య సమన్వయం కరువు
- పాత నాయకులు ఓ గ్రూపు
- ముందు చేరిన వారు మరో గ్రూపు
- బీఆర్ఎస్ ఉన్న సమయంలో అసమ్మతి వర్గం మరో గ్రూపు

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత నియోజకవర్గ కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు అధికం కావడంతో ఆ పార్టీ ప్రస్తుతం హౌజ్‌ఫుల్‌గా ఉన్నా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆ పార్టీ విచిత్ర పరిస్థితులు ఎదుర్కొంటుంది. బీఆర్ఎస్ నుంచి సీనియర్ నాయకులు, మేయర్లు, చైర్మన్‌లు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు వంటి నేతలు కాంగ్రెస్‌లో చేరారు. పేపర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు చాలా బలంగా కనిపిస్తున్నా పార్టీకి ప్రజా బలం కనబటం లేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి పార్లమెంట్ ఎన్నికలు వచ్చేనాటికి ఫుల్‌గా ఉన్న బీఆర్ఎస్ పార్టీ స్థానికంగా ఖాళీ అయ్యింది. పార్టీ అధ్యక్షులు, ప్రధాన నాయకులు, కౌన్సిలర్లు ఇలా చాలా మంది బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాసం పెట్టడానికి కొందరు, తప్పించుకోవడానికి మరికొందరు, స్వంత పనుల కోసం మరికొందరూ ఇలా మెజారిటీ నాయకులు కాంగ్రెస్‌లో చేరిపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో, జిల్లా పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ సమక్షంలో ఇంకొందరు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికలకు ముందు మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండేది. నాయకుల సంఖ్య తక్కువగా కనిపించేది. ఉన్న కొంతమంది రెండు, మూడు గ్రూపుల కింద పని చేసేవారు. రాష్ట్రంలో ఒక్కసారిగా పార్టీ అధికారంలోకి రావడంతో జంపింగ్ నాయకులతో బలంగా మారినట్లు కనిపిస్తోంది.

కలవని చేతులు..

మున్సిపాలిటీలలో, మండలాల్లో నాయకుల మధ్య సమన్వయం మాత్రం కుదరడం లేదు. మేడ్చల్ మున్సిపాలిటీలో సీనియర్ నాయకులు ఓ వర్గంగా, చైర్మన్ మరో వర్గంగా, కౌన్సిలర్లు ఇంకొక వర్గంగా ఉంది. మూడు గ్రూపులతో కాంగ్రెస్ ముక్కలుగా తయారైంది. గుండ్లపోచంపల్లిలో వైస్ చైర్మన్ ఒక వర్గంగా, కండ్లకోయ మాజీ సర్పంచ్ మరో గ్రూపుగా, కౌన్సిలర్లు ఇంకొక గ్రూపుగా ఉన్నారు. సీనియర్లు, పార్టీలో చేరిన వారు ఎక్కడా ఐక్యతతో పనిచేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఎవరికి వారే రాజకీయాలు నడిపిస్తున్నారు. పార్టీలో చేరిన వారు సైతం కార్యక్రమాలకు దూరంగా కనిపిస్తున్నారు. ఒక సమయంలో రాజకీయం నడిపిన నాయకులు తాజాగా రాజకీయాలకు దూరంగా కనిపిస్తున్నారు.

పట్టణ కమిటీ కరువు..

నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మేడ్చల్‌కు కాంగ్రెస్ పట్టణ కమిటీ లేకుండాపోయింది. గ్రూపు రాజకీయాల కారణంగా చాలా ఏళ్ళ నుంచి పట్టణ కాంగ్రెస్ నడిపించే కమిటీనే లేదు. గతంలో అడ్‌హక్ కమిటీ ఉన్నా చేరికలతో ఆ కమిటీ నాయకులు ఎక్కడ పోయారో తెలియడం లేదు. గతంలో అధ్యక్షులుగా పని చేసిన నాయకులే పార్టీకి పెద్ద దిక్కులా వ్యవహరిస్తున్నా పార్టీని నడిపించి నాయకుల మధ్య సమన్వయం చేసే నాయకుడే లేకుండా పోయాడు.

గ్రామాల్లో అంతే..

గ్రామాల్లో మాజీలు కాంగ్రెస్‌లో చేరినా పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో గ్రామాల్లో పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగానే మారింది. మండలస్థాయి రాజకీయాలు చేసిన వారు సైతం సైలెంట్‌గా మారిపోయారు. నియోజకవర్గ కాంగ్రెస్‌ను నలుగురు నాయకులు నడిపిస్తున్నా పాత, కొత్త చేతులు మాత్రం కలవడం లేదు. ఏ నాయకుడికి నచ్చిన విధంగా తమ నాయకుడి నీడలో పని చేస్తూ ఎవరికి వారే ఉంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్‌లో ఇలాగే ఉంటే పార్టీ నష్టపోక తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.